క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

బూర్జ: మండలంలోని కొల్లివలస గ్రామంలో గల అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు బంకుపల్లి ప్రసాద్ శర్మ, పువ్వల మణికంఠ ఆధ్వర్యంలో ప్రత్యేక, కుంకుమ పూజలు చేశారు. వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కమిటీ మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా యూనిఫాం



యూనిఫాంను భద్రపరుస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

పొందూరు: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం పంపిణీకి అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున అందించనున్నారు. ఎమ్మార్సీలో యూనిఫాం భద్రపర్చారు. ఎంఈఓ పట్నాన రాజారావు పర్యవేక్షించారు. సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



ఆస్పత్రి పరిసరాలు పరిశీలిస్తున్న ఎంపీపీ కూర్మినాయుడు

సారవకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వైద్యురాలు వాన దేవికను ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు సూచించారు. గురువారం పీహెచ్సీని పరిశీలించారు. పరిసరాలన్నీ పిచ్చి మొక్కలతో నిండి ఉండటంతో వాటిని తొలగించాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను ఆస్పత్రి అభివృద్ధి కమిటీ తీర్మానం చేసి వేలం వేయాలన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం సిబ్బందితో మాట్లాడారు. పీహెచ్సీ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఏపీఓ నారాయణరావును సూచించారు. ఆంజనేయ ప్రసాద్, బల్ల రాంబాబు, నక్క రామరాజు, వాబ యోగేశ్వరరావు తదితరులు ఉన్నారు.


వితరణ..



శ్రీనివాసరావుకు వస్తువులను అందజేస్తున్న రామరాజు

పాతపట్నం: మండల కేంద్రంలోని సత్యసాయి సేవా సమితికి పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వి.రామరాజు వెండి గ్లాసు, కంజరి, భజన తాళాలు గురువారం అందజేశారు. సత్యసాయి బాబా మందిరంలో సేవా సమితి కన్వీనర్ నాగులపల్లి శ్రీనివాసరావుకు వీటిని అందించారు. పర్తియాత్ర ఇన్చార్జి కె.వి.రమణమూర్తి, బి.సత్యనారాయణ, జి.శ్రీదేవి, జి.రాజేశ్వరి, వి.రామారావు, ఎస్.తిరుపతిరావు, సి.హెచ్.రాంబాబు, ఎస్.అనంతకృష్ణ, సాయి భక్తులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



నీటిలో దర్శనమిస్తున్న నీలకంఠేశ్వరస్వామి

పాతపట్నం: మండల కేంద్రంలోని మహేంద్రతనయ నదీ తీరాన ఉన్న నీలకంఠేశ్వర స్వామికి మాస శివరాత్రి సందర్భంగా గురువారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలకంఠేశ్వరుడు గంగలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే స్వామికి ప్రధాన అర్చకులు పార్వతీశం ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. పాతపట్నం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఫోన్ పే పేరిట మోసం

నరసన్నపేట: స్థానిక బజారు వీధిలోని పలువురు ఇళ్లకు గుర్తుతెలియని వ్యక్తి గురువారం సాయంత్రం వెళ్లి తన ఫోన్ పే మరమ్మతులకు గురైందని నమ్మబలికాడు. పాల వ్యాపారి గుడియా రమేష్ ఇంటికి వెళ్లి తన ఫోన్ పే పని చేయడం లేదని, ఫోన్ ఒకసారి కావాలని అడిగాడు. ఫోన్ పే ఓపెన్ చేసి ఏదో చూస్తున్నట్లు నటించాడు. రమేష్ ఫోన్ పేను నుంచి రూ.19 వేలు తస్కరించాడు. కొంత సమయం తర్వాత గుర్తించిన రమేష్ ఈ విషయాన్ని స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ విధంగా బజారు వీధిలో పలువురు వ్యాపారులు మోసపోయినట్లు సమాచారం. దీనిపై స్థానిక పోలీసులను సంప్రదించగా దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

పోరాట యోధుడు అల్లూరి

తెల్లదొరలను ఎదిరించి దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చేందుకు గుండె ధైర్యంతో పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. అల్లూరి జయంతిని నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో గురువారం నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పోరాటాలను కొనియాడారు.

– సాక్షి నెట్వర్క్



పాతపట్నం: తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు, సిబ్బంది



నరసన్నపేట: ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ, తదితరులు



జలుమూరు: ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న అధికారులు



నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లత, అధ్యాపకులు



ఆమదాలవలస: ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీడీఓ వాసుదేవరావు, సిబ్బంది



ఆమదాలవలస: మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి చిత్రటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది



సరుబుజ్జిలి: అల్లూరి పోరాటలను వివరిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు

ఉపాధి పనుల పరిశీలన



మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

కొత్తూరు: మండలంలోని మాతల గ్రామంలో గల సాటు నీటి కాలువలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ త్రివిక్రమరావు గురువారం పరిశీలించారు. ఉపాధి పనులు రైతులకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్ధారించిన కొలతల ప్రకారం పనులు చేసినప్పుడే రోజుకు రూ.300 వేతనం పొందవచ్చన్నారు. పనుల్లోకి రానివారి పేర్లతో హాజరు వేస్తే చర్యలు తీసుకుంటామని మేట్లు, ఉపాధి సిబ్బందికి ఎంపీడీఓ హెచ్చరించారు.

వివేకానందుడు యువతకు ఆదర్శం



వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కొత్తూరు: స్వామి వివేకానంద ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎద్దు సుందరనారాయణ వరహాలమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎద్దు గోపాలదాసు నాయుడు, స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ బండారి రవికుమార్ పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద వర్ధంతిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్వామీ వివేకానంద సమాజం కోసం చేసిన సేవలను కొనియాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం



పారశిల్లిలో తొలగించిన రేకుల షెడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కృష్ణచైతన్య

● పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: వైఎస్సార్సీపీ కార్యకర్తలపై కక్షతో కూటమి ప్రభుత్వం, స్థానిక టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆరోపించారు. గురువారం సాయంత్రం పారిశిల్లి, చోడవరం గ్రామాల్లో పర్యటించి వైఎస్సార్సీపీ కార్యకర్తలు మేడి కృష్ణారావు, బోనెల కృష్ణను పరామర్శించారు. గురువారం ఉదయం వీరికి చెందిన రేకుల షెడ్, ఇళ్లను టీడీపీ నాయకుల ఒత్తిడితో రెవెన్యూ సిబ్బంది ఆక్రమణల పేరిట తొలగించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కృష్ణచైతన్య వారి ఇళ్లకు వెళ్లి ధైర్యం చెప్పారు. మీకు అన్నివిధాలా అండగా ఉంటామని, నిరాశ చెందవద్దన్నారు. పేదలపై ఎందుకీ కక్ష అని ప్రశ్నించారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండించారు. నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, బార్ల వేణుగోపాలరావు, లుకలాపు రవి తదితరులు ఉన్నారు.

తలనీలాల వేలం ద్వారా రూ.77 వేల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవమైన పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారికి గురువారం నిర్వహించిన తలనీలాల బహిరంగ వేలంలో రూ.77 వేలు ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. ఆలయం ఆవరణలో ఆముదాలవలస వెంకటేశ్వర ఆలయ ఈఓ టి.రవి పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. పాలకొండకు చెందిన పి.నాగేశ్వరరావు తలనీలాల వేలం పాడుకున్నాడు. 2023 జూలై 3వ తేదీ నుంచి ఇప్పటివరకు ఆలయానికి వచ్చే భక్తులు సమర్పించిన తల నీలాలని ఈఓ తెలిపారు. ఆలయ గుమస్తా సుదర్శనరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతితో మరింత బాధ్యత



సుధాకర్ను సన్మానిస్తున్న సీఐ వేణుగోపాలరావు

హిరమండలం: ఉద్యోగోన్నతి అనేది మరింత బాధ్యత పెంచుతుందని సీఐ వేణుగోపాలరావు అన్నారు. హిరమండలం పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా పనిచేస్తున్న మెట్ట సుధాకర్కు ఇటీవల ఎస్ఐగా ఉద్యోగోన్నతి లభించి శ్రీకాకుళం బదిలీ అయింది. ఈ సందర్భంగా ఆత్మీయ సన్మాన సభను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ వేణుగోపాలరావు మాట్లాడుతూ సుధాకర్ ఏఎస్ఐగా ఉత్తమ సేవలందించారని అభినందించారు. పోలీస్ విధి నిర్వహణ కత్తిమీద సాము వంటిదన్నారు. అయినా బాధ్యతగా విధులు నిర్వహించేది పోలీస్ శాఖ అన్న విషయం ప్రతిఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ను సన్మానించారు. సన్మానగ్రహీత సుధాకర్ మాట్లాడుతూ అందరి సహకారంతో విధులు సక్రమంగా నిర్వహించానని చెప్పారు. ఎస్ఐ నారాయణ స్వామి, గ్రామపెద్దలు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయం తనిఖీ



మాట్లాడుతున్న ఆర్జేడీ చిన్మయిదేవి

సారవకోట: అంగన్వాడీ కేంద్రాలను సూపర్వైజర్లు, సీడీపీఓలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని విశాఖపట్నం రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి సూచించారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూపర్వైజర్లు, సీడీపీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్వైజర్లు వారికి కేటాయించిన సెక్టార్ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించాలన్నారు. రికార్డులు, పౌష్టికాహార నిల్వలు, ప్రీ స్కూల్ నిర్వాహణ తదితర అంశాలను పరిశీలించి, బాగా పనిచేయని కార్యకర్తలకు మెమోలు జారీ చేయాలన్నారు. సీడీపీఓ హెచ్.కె.కామాక్షి, సూపర్వైజర్లు సుజాత, సీతారత్నం, పద్మ, సునీత ఉన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం?

నరసన్నపేట: స్థానిక మారుతీనగర్-2 లో నివాసముంటున్న సెక్యూరిటీ గార్డు అరుణ్కుమార్ భార్య మీనాకుమారి గురువారం మధ్యాహ్నం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. పాతపట్నం మండలం కొరసవాడకు చెందిన మీనాకుమారికి భర్తతో ఉన్న మనస్పర్ధలు కారణంగా విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది మీనాకుమారిని నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్కు తరలించారు. ఈ సంఘటనపై నరసన్నపేట ఏఎస్ఐ ఆశిరినాయుడు వద్ద ప్రస్తావించగా..ఈ ఘటన జరిగినట్లు తెలిసిందని, దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కారు డ్రైవర్లు

హిరమండలం: మండల కేంద్రంలోని మైత్రి కాలనీకి చెందిన కారు డ్రైవర్ రమేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. రమేష్ కుటుంబానికి శ్రీచెవిటమ్మ తల్లి డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు లక్ష్మణరావు ఆధ్వర్యంలో రూ.13.500లను గురువారం అందజేశారు. యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు పొందాలి

ఆమదాలవలస: కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రానికి దరఖాస్తు చేసుకుని గుర్తింపు కార్డులను పొందాలని వ్యవసాయాధికారి మెట్ట మోహన్రావు అన్నారు. మండలంలోని కలివరం గ్రామంలో గల రైతు భరోసా కేంద్రంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలు హక్కు గుర్తింపు కార్డులు పొందిన రైతులకు పంట నష్టపరిహారం, పంటల బీమా, అన్నదాత సుఖీభవ, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తదితర సంక్షేమ పథకాలను ప్రభుత్వం నుంచి అందించడం జరుగుతుందని తెలిపారు. భూసార పరీక్షల ఫలితాల గురించి రైతులకు వివరించారు. బండి రాజులు, వీఏఏ ఎస్.అశోక్, వీఆర్వో అనుపమ, రైతులు పాల్గొన్నారు.


గ్రామాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కూన రవికుమార్

ఆమదాలవలస: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పంచాయతీ రాజ్ అధికారులతో గురువారం ఆమదాలవలసలో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, సీసీ రోడ్డులు, మౌలిక వసతుల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పలు శాఖల ఉన్నతాధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



విద్యా సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ

జలుమూరు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓలు బి.మాధవరావు, ఎం.వి.ఆర్.ప్రసాద్ అన్నారు. గొటివాడ, మహ్మద్పురం, కెల్లివానిపేట ప్రాథమిక పాఠశాలలను గురువారం పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు చదువులో రాణించాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు కూడా మరింత బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకం పరిశీలించి మెనూ నాణ్యతలో రాజీపడకూడదన్నారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, రాజు, ఉష పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



ఎల్.ఎన్.పేట: డ్రైనేజీల్లో చెత్తను తొలగించి ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న కార్మికులు



ఆమదాలవలస: కొర్లకోటలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: మండలంలోని కొమ్మువలస గ్రామంలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీలో పూడికలు తొలగించి ట్రాక్టర్ ద్వారా గ్రామానికి దూరంగా తరలించారు. ఇంటిని ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటామో గ్రామాన్ని, వీధులను అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీపీఏవీ అధ్యక్షుడు పొన్నాన రామకృష్ణ సూచించారు. గ్రామ పెద్దలు రెడ్డి సీతారాం, పంగ కృష్ణారావు తదితరులు పర్యవేక్షించారు.

కొర్లకోటలో..

ఆమదాలవలస: మండలంలోని కొర్లకోట గ్రామంలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సీసీ కాలువల్లోని చెత్తను తొలగించారు. గ్రామంలో సీసీ కాలువల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. సనపల అప్పలనాయుడు, టీడీపీ నాయకులు పర్యవేక్షించారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని మండల ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు అన్నారు. గురువారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ విద్యాప్రమాణాలకు పెద్దపీట వేయాలన్నారు. ఉత్తమ విద్యాబోధన అందించాలన్నారు. నిర్బంధ విద్య నేరమని.. ప్రభుత్వం పెద్దఎత్తున రాయితీలు, పథకాలు అందిస్తున్నందున ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎంఈఓ రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఠాధిపతిగా వరసిద్ధి వరప్రసాద్ గురూజీ



వరప్రసాద్ గురూజీకి పట్టాభిషేకం

● లంకపేటలో తూర్పు కాశీక్షేత్రం ఏర్పాటు



గీతాలను ఆలపిస్తున్న శరత్చంద్ర

శ్రీకాకుళం కల్చరల్: గార మండలం లంకపేటలోని ఘంటసాల స్మారక పీఠాన్ని తూర్పుకాశీక్షేత్రంగా మారుస్తూ దానికి పీఠాధిపతిగా వరసిద్ధి వరప్రసాద్ గురూజీకి పట్టాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో గురువారం పట్టాభిషేక, పౌర సత్కారం, ఘంటసాల గానామృతం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ పీఠం అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తామన్నారు. ముందుగా స్వర సామ్రాట్ డాక్టర్ టి.శరత్చంద్ర ఆధ్వర్యంలో ఘంటసాల గీతామృతంలో పలు భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో నోరి నారాయణమూర్తి, బాహుబలి సినిమా రచయిత సాయిమాధవ్, సుందరాకాండ శ్రీనివాస్, నల్లి ధర్మారావు, సినీ రచయిత రాజేంద్రకుమార్, దర్శకులు రాజరామన్, సంగీత దర్శకులు ఎంఎంశ్రీలేఖ, సినీ నటులు సుమన్, పి.నాగేశ్వరరావు, శివపార్వతి, సంపూర్ణేష్బాబు, గౌతంరాజ్, రామకృష్ణప్రసాద్, సియాద్ రెహ్మాన్, అబ్దుల్ రహమాన్, అరుణ్పాల్, విజయభాస్కర్, నిర్మాత రవిరాజ, సర్పంచ్ చల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకు గుర్తింపుకార్డులు తప్పనిసరి

శ్రీకాకుళం రూరల్: కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు తప్పనిసరిగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఉషా కుమారి అన్నారు. గురువారం సానివాడ, ఒప్పంగి, ఖాజీపేట గ్రామాల్లో కౌలురైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలురైతు గుర్తింపు కార్డులు ద్వారా పంట రుణాలు, ఈ-క్రాప్ నమోదు, అన్నదాత సుఖీభవ, పంట నష్ట పరిహారం, పంటల బీమా, పంట కొనుగోలు రాయితీ, వ్యవసాయ ఉత్పత్తులు, ఇతర పథకాలు వర్తిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.